# అవ్యక్తం

= రచన : శ్రీ కె. రవికుమార్ =

'అమ్మా'

'ఏం తల్లీ, మళ్ళీ ఏమొచ్చింది? కటువుగా అంది జగదాంబ.

'ఆకలేస్తుందే. రొట్టి తెప్పించవూ?' ప్రాధేయపూర్వకంగా అడిగింది.

'మన మొహాలకు రొట్టెలుకూడాను. నోరుమూసుకుని పడుకో. మళ్ళీ నోరెత్తావంటే చంపి అవతలపారేస్తాను' కసురుకుంది.

అప్పుడే ఆఫీసునుంచి వచ్చిన రామనాథం పిల్లిలా నిశ్శబ్దంగా లోపలికి వచ్చాడు. అతను వస్తూనే విన్న మాటలతనికి కష్టమనిపించలేదు. కాని మంచంలో జ్వరంలో మూల్గుతున్న ఏడేళ్ళ రాధను చూసి నిస్సహాయంగా నిట్టూర్చాడు. చేతిలోని కాగితాలసంచీ గోడకి తగిలించి మెల్లగా మంచం దగ్గరకు వచ్చాడు.

'అమ్మా, రాధా' ఆప్యాయంగా తల నిమురుతూ పిలిచాడు. మగతగా కళ్ళు విప్పి 'నాన్నా' అంటూ ఏదో చెప్పబోయింది. కాని కన్నీరు పెల్లుబికింది. గొంతు పెగల్లేదు.

'ఏడవకమ్మా. రేపుపొద్దున్నకల్లా అదే తగ్గిపోతుంది.' సముదాయించాడు.

రోజంతా అనుభవించిన బాధ గుర్తుకు తెచ్చుకుంటు కాసేపు ఏడ్చేసింది.

'ఎందుకే పిచ్చితల్లీ, ఏడుస్తావూ'అంటూ రామనాథం జేబురుమాలుతో రాధ కళ్ళు తుడిచాడు.

కాసేపాగి 'నాన్నా రొట్టి' మెల్లగా అందించింది.

'ఓ... తెస్తాగా. ఏడవకు' అంటూ లేచాడు.

'దాన్నేం చూస్తారు. రోజూ వున్నదేగా. ఎవరికో ఒకళ్ళకు విడవకుండా దాపురిస్తూనే వుంటాయి వెధవ రోగాలు. ముందు మీరు కాళ్ళు కడుక్కోండి. భోంచేద్దురుగాని' పనిచేసుకుంటూ పురమాయించింది.

'అప్పుడే ఆకలి కావటంలేదు. కాస్తాగి భోంచేస్తాలే' అంటూ తల మరోవేపు తిప్పుతున్నాడు.

రాధ దీనంగా చూస్తూంది. రామనాథం చొక్కాజేబులో చేయిపెట్టాడు. ఇరుగ్గా అనిపించి జేబులోని చెత్తంతా బయటకు తీశాడు. చిరాకుగా వాటిని పారేద్దామనుకున్నాడు. ఒక్కొక్కటి విప్పి చూశాడు. మందు చీటీల దగ్గర్నుంచి అన్నీ పనికివచ్చేవే. మళ్ళీ జేబును ఆశగా వెదికాడు. ఒక పదిపైసల బిళ్ళమాత్రం చల్లగా తగిలింది. గుడ్డిదీపం వెలుగులో గోడమీద కాలెండరు మీద యిరవై తొమ్మిదిని చూస్తూ గుటకలు మింగాడు.

'నాన్నా, మీకోసం ఎవరో వచ్చారు' అంటూ పరుగెత్తుకువచ్చాడు రఘు. జేబుసర్దుకుని చకచకా బయటకు వచ్చి 'ఎవరూ' అంటూ చూశాడు.

'ఓహో! నువ్వటోయ్. రా లోపలికి' మళ్ళీ తనే పిలిచాడు.

'కాస్తాగివస్తాలెండి. ఇంకా ఇంటికి వెళ్ళలేదు. అలా బజారుకెళ్ళి వస్తున్నాను. భోంచేసి వచ్చేదా' అడిగాడు జూనియర్ క్లర్కు కేశవరావ్.

'దేనికోయ్. ఓహో అదేనా! ఆ డిఫరెన్సు పట్టుకోవటానికేగా. దానికోసం మళ్ళీ నువ్ రావడమెందుకు. యిటిచ్చేయ్. రేపొచ్చేటప్పుడు పట్టుకొస్తాను' అంటూ అతని చేతిలోని ఫైలుని అందుకున్నాడు.

'అరే మీకు చాల ట్రబులిస్తున్నాను' మాట వరుసగ అనేశాడు కేశవరావు.

'అఁ...దానికేంగాని చూడు మరి...చిన్న అవసరమొచ్చింది. నీదగ్గరేమైనా దొరుకుతుందా? ఫస్టుకి ఇచ్చేస్తాను.' అభిమానాన్ని పూర్తిగా చంపుకోలేక యిబ్బందిగా అడిగాడు.

'ఓ యస్! దానికేంసార్! తీసుకోండి. ఎంతమాత్రం కావాలి. ఇది సరిపోతుందా?' అంటూ రెండు రూపాయలనోటు నోటు అందించాడు.

'ఓ...చాలు' అందుకున్నాడు. కేశవరావ్‌ని పంపేసి లోపలికి వచ్చాడు.

× × ×

'ఏమండీరామనాథంగారూ. ఇలా అయి తేలాభం లేదు. ఇంత సర్వీసువున్న మీరే యిలా చేస్తే ఎలా? మరోసారి యిలా చేస్తే చాల సీరియస్‌గా యాక్షన్ తీసుకోవాల్సి వస్తుంది. ఇక వెళ్ళండి.'

మౌనంగా తలవంచుకొని ఆఫీసరు గదినుంచి బయటపడ్డాడు. మెల్లగా తన సీట్లోకి వెళ్ళి కూర్చున్నాడు.

(తరువాయి 85వ పేజీలో)

(24వ పేజీ తరువాయి)

పేపర్ వెయిట్ క్రింద రెపరెప లాడుతున్న మెమో వంక అదోలా చూశాడు, మళ్ళీ తన పనిలో మునిగి పోయాడు.

మధ్యాహ్నం రెండు దాటింది. 'రామనాథంగారూ, కాఫీకి రారూ' కేకేశాడు ఓ కోక్లర్క్.

'ఇది కాస్తా పూర్తిచేసుకుని వెళ్లాలే. మీరెళ్ళిరండి.' తల త్రిప్పకుండానే అన్నాడు.

'పోనీ జీతమైనా తీసుకున్నారా' అడిగాడతను.

'ఇంకా లేదు. ఇందాకటినుంచీ రెష్షుగా వుంటుందని వెళ్ళలేదు. ఏదీ కాషియరున్నాడా' వ్రాస్తూన్న కలాన్ని కాస్త ఆపి ప్రక్కకు తిరిగాడు.

'మీరున్నారని అందరూ వుంటారా. కాఫీకి వెళ్ళాడు. ఏ మూడింటికోగాని రాడు. సరే నే వెళ్తా. తలనొప్పిగా వుంది' అంటూ వెళ్ళిపోయాడు.

\+ + +

సాయంత్రం ఏడు కావస్తూంది. బజారు మీదుగా వస్తూ బరువు తగ్గించుకుని తేలిగ్గా యిల్లు చేరుకున్నాడు రామనాథం.

'నా...న్నా...రొ...చ్చా...రూ' ముద్దుగా ఒక్కో అక్షరం వత్తి పలుకుతూ అతని కాళ్ళను చుట్టుకుంది రాధ. అంతవరకు వుసూరుమంటూ కూర్చున్న పిల్లలు ఒక్కసారిగా చుట్టేశారు...

'నాన్న యివ్వాళ మనకు డబ్బు లిస్తారు. జీతం వచ్చిందిగా' ఆశగా అన్నాడు రఘు.

'నాన్నా ! మరి నాకీ కొత్త చొక్కా కుట్టించవూ' అంతకన్నా పెద్ద కోరికే వుండదన్నట్లు కళ్ళు పెద్దవి చేసుకుంటూ అడిగాడు రాము.

'ఆఁ...యిప్పుడదే తక్కువైంది. మీనాన్న తెచ్చే మాటలు మూలుగుతున్నాయి. పదండావతలకి' జగదాంబ వంట గదిలోనుంచి ఖంగుమంటూ వచ్చింది. పిల్లలంతా ఎటువాళ్ళటు పరుగెత్తారు.

రామనాథం మనసు చివుక్కుమంది.

\+ + ×

ఎంత ప్రయత్నించినా నిద్ర రావటంలేదు. రామనాథం మనసు ఏదో తర్కించుకొంటూంది.

దూరంగా గడియారం గంటలు కొట్టింది. పదకొండే కొట్టిందో, పన్నెండే కొట్టిందో పట్టించుకునే స్థితిలో లేడు. మనసంతా చెల్లాచెదరుగా వుంది. ఆకాశానికేసి నిరాశగా చూస్తున్నాడు.

ఏమిటో తన జీవితమంతా ముళ్ళమీద పెట్టినట్లయింది. ఏరోజు కారోజు భారంగా దొర్లించాల్సి వచ్చింది. తన కొచ్చే నాలుగురాళ్ళతోనూ అప్పులవాళ్ళను సమాధాన పరచలేకపోతున్నాడు.

ఆర్థికస్థితితోబాటు మానసికంగాకూడా తన స్థితి పూర్తిగా దెబ్బతిన్నది. కష్టసుఖాల్ని పంచుకుంటూ, కలో గంజో త్రాగి పడుందామన్న జ్ఞానం కించిత్తయినా లేదు తన భార్య జగదాంబకు. చీటికీ మాటికీ తన అసమర్థతను వేలుపెట్టి చూపుతూ హృదయాన్ని కలిచేస్తుంది. ఆ చిత్రవధ భరించటం కష్టంగానే వుంది.

గత 34 సంవత్సరములనుంచీ
ఆయుర్వేద వైద్యములలో ప్రసిద్ధిపొందిన
కె. ఎన్. పండిట్ వారి
వీరరత్న నెం 1.
TRADE MARK


REG No. 231292
రక్తవృద్ధి, మరియు దేహపుష్టికి వుత్తమమైన వనమూలికలచే ఆయుర్వేద శాస్త్రప్రకారం తయారించిన యువకులకూ వృద్ధులకూ, శక్తివర్ధకమైన టానిక్.
20 రోజుల బుడ్డి ఒకటికి రూ 6-00
10 రోజుల బుడ్డి ,, రూ 3-25
త॥ చా॥ అదనము. టానిక్ కావలసినవారు ముందుగా రూ. 2-00 పంపవలెను.
వివరములకు.
వీరరత్న ఫార్మసీ
పి. బి. నెం: 11, గ్రైన్ బజారు
(సిటీ మార్కెట్) బెంగుళూరు-2.

ఇంట్లో సంగతి అటువంచి, ఆఫీసు గొడవ మరీ ఎక్కువైంది. ఇన్ని చిక్కుల్లోపడి ఏదైనా చిన్న పొరపాటు చేశాడో మర్నాడే పెద్ద మెమో. అది చాలనట్లు సమర్యాదగా పిలిపించి నానా చివాట్లూ పెట్టడం. ఒక్కోసారి చెప్పలేనంత కోపం వస్తుంది. కాని పేదవానికోపం పెదవులకి చేటేగా.

ఇవి రెండూ కాక వీధిలో తన పరువు కాపాడుకోవటం పెద్దసమస్యగా తయారైంది. ఘట్టుకి యిస్తానన్న బాకీ అయిదు ఘట్టులు మారినా తీరకపోవటంతో, ఎవరో ఒక మహానుభావుడితో నలుగురిముందూ తనకు ఆశీర్వాదాలు తప్పటంలేదు.

భగవంతుడు కొందర్ని పూర్తిగా కష్టపడమనే పుట్టిస్తాడు. వాళ్ళకు సుఖం అనేది దరిదాపుల్లోనే వుండదు. మరి నాలుగు జన్మలకైనా వుంటుందో లేదో అనుమానమే. అలాంటివాళ్ళలో తను మొదటివాడు. కాకపోతే ఏమిటి. ఒకర్ని సుఖపెట్టనూలేక, తానూ సుఖపడలేకపోయిన జీవితం ఎందుకు.

అవును తను చిన్నపుడు ప్రథమంగా విన్న ఓ వింత వార్త యింకా గుర్తుంది. ఇంటి ఎదురు అంజయ్య అప్పులవాళ్ళతో వేగలేక ఎటో పారిపోయాడట. అప్పటికది చాల పెద్ద వార్తలా వుండేది. కాని యిప్పుడది పరిపాటైపోయింది.

మొన్నీమధ్య కాలువలో దొరికిన శవాన్ని గురించి పేపర్లో చదివినపుడు చాల ఆశ్చర్యపడ్డాడు. భార్యాపిల్లల్ని పోషించలేక అలా జీవితాన్ని చాలించుకున్న వాడిమీద తనకోవిధమైన చులకనభావంకూడా ఏర్పడింది. ఆ తర్వాత, పాపం! చేతకాని పిరికివాడు! ఆడదానికంటె అన్యాయంగా అయ్యాడని కాస్త సింపతీ మాత్రం కలిగింది.

కాని యీరోజు వాడు చాల మంచిపని చేశాడనిపిస్తూంది. తనబోటి నిర్భాగ్యులకు మార్గదర్శకుడయ్యాడు. తాను అంజయ్యలాగా పారిపోయి బ్రతకలేడు. కనుక వున్న దొకటే మార్గం.

నిజంగా తను బ్రతికి సాధించేదేమీ లేదు. ఇంటా, బయటా విలువలేక జీవచ్ఛంలా వుండేకన్నా అందర్నీ వదిలేసి శాశ్వతంగా ప్రక్కకు తప్పుకుంటే వుత్తమం.

ఉన్నట్లుండి పైకి లేచాడు. ఏదో పిట్ట వికృతంగా అరచింది. గుండె దడదడ లాడింది. కర్తవ్యం స్ఫురించినట్లు ఒక్కడుగు ముందుకువేశాడు. అప్రయత్నంగా ఓసారి క్రిందకు చూశాడు. వరుసగా నిద్రపోతున్న అయిదుగురి పిల్లలూ 'నాన్నా' అంటూ దీనంగా పిలిచినట్లయింది. మనసుకు మమకారపు సంకెళ్ళుపడ్డాయి. కదల్లేకపోయాడు. భగవంతుడు విధించిన యీ ఖైదును తప్పించుకోవటం అసాధ్యమనిపించింది.

మెల్లగా మళ్ళీ ప్రక్కమీదకు వాలాడు. ఏవో ఆలోచనలు. బ్రతకటం ఎంత కష్టమో చావటమూ అంతేననుకున్నాడు. 'మరి ఎందరో ఆత్మహత్యలు ఎలాచేసుకోగలిగారు? వాళ్లలాగా తనూ ఎందుకు చేయలేడూ?' అన్న ప్రశ్నలు మెదిలాయి. వెంటనే వాటికి సమాధానమూ దొరికింది.

వాళ్ళు బ్రతకలేక చనిపోయారు. తను చావలేక బ్రతుకుతున్నాడు. అంతే.

బరువుగా కళ్ళు మూసుకున్నాడు.




USE ALWAYS
ARUNA
BANIANS

అరుణ
బనియన్లనే ఉపయోగించండి.
అవి:-చిరకాల మన్నికకు-రకానికీ అత్యుత్తమమైనది.
అత్యుత్తమమయిన సాదా, వల బనియన్లు, నూలు స్వెట్టర్లు, ఉత్పత్తిదారులు.

THE ARUNACHALAM KNITTING FACTORY
KARUR
(S. I.)

ది అరుణాచలం నిట్టింగ్ ఫ్యాక్టరి.
కరూర్ (S.I.)